క్లుప్తంగా

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మర్పల్లి: కొత్లాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం 11 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించనున్నట్లు సర్పంచ్ ప్రభాకర్, బాబాసాహెబ్ యువజన సంఘం సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మాజీ మంత్రులు డాక్టర్ చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీపీ బట్టు లలిత, జెడ్పీటీసీ మధుకర్ తదితరులు రానున్నట్లు ప్రకటించారు.

సంకల్ప సభను విజయవంతం చేయండి

మర్పల్లి: విజయ సంకల్ప సభను విజయవంతం చేసేందుకు బీజేపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఆదివారం చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని, ఈ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరవుతారని వెల్లడించారు. కావున మండల పరిధిలోని బూత్ కమిటీల వారీగా కార్యకర్తలను తరలించేందుకు వాహనాలు సమకూర్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, బలరాంగౌడ్, మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, సీహెచ్ మధుకర్, పంతులు బాయి శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ స్తంభం



శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టి ఘనాపూర్‌లో పలు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడక్కడ పోల్స్ ఒరిగాయని.. గాలి,వాన దుమారానికి ఎప్పుడు ఇళ్ల మీద పడతాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఆ స్తంభాలను పరిశీలించి.. కొత్తవి అమర్చాలని కోరుతున్నారు. ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు గ్రామస్తులు చెప్పారు.

ఇంద్రారెడ్డికి నివాళి



ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న నర్సింహారెడ్డి

తాండూరు రూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి, స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం కోటబాస్పల్లిలో గ్రామంలో ఆయన విగ్రహానికి ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోట్టిగ నర్సింహారెడ్డి(బాబు) పూలమాల వేసి నివాళి అర్పించారు. 1985 సంవత్సరంలో హోం మంత్రిగా మలాక్‌పూర్, కోటబాస్పల్లిలో ప్రభుత్వ నాపరాతి గని భూములను పేదలకు పంచారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్, రాజశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, నర్సిరెడ్డి, కిష్టప్ప, శకుర్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో 50 మంది చేరిక



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: దుద్యాల మండలం హకీంపేట గ్రామానికి చెందిన 50మంది శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని చెప్పారు.

ఆలయంలో పల్లకీ సేవ

షాద్‌నగర్: చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి పల్లకీ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, ప్రమోద్, సునీల్ స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కుమార్‌గౌడ్, వసంతరావు, రఘుగౌడ్, రమేష్, నర్సింహులు, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు



పరిగి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కొడంగల్‌లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



తాండూరులో శీర్‌కుర్మా తింటున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



మోమిన్‌పేటలో చిన్నారుల అలయ్ బలయ్



పెద్దేముల్: తట్టెపల్లిలో..

పవిత్రమైన రంజాన్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. చివరి శుక్రవారం కావడంతో మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మతపెద్దలు ఖురాన్ విశిష్టత, రంజాన్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం కులమతాలకు అతీతంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకంక్షాలు తెలుపుకొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరులో సామూహిక ప్రార్థనలు



కుల్కచర్లలో..



అనంతగిరి: మాజీమంత్రి ప్రసాద్‌కుమార్



మర్పల్లిలో..



బంట్వారం: తొర్మామిడిలో



పూడూరు: మన్నెగూడ ఈద్గా వద్ద..



తాండూరు రూరల్: మల్కాపూర్‌లో..



మోమిన్‌పేటలో..



యాలాల: ముద్దాయిపేటలో..

సమస్యలు చెబితే.. పరిష్కరిస్తా

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని, సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి తెస్తే.. వెంటనే వాటిని పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి చెప్పారు. పల్లె బాటలో భాగంగా యాబాజిగూడలో తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు చెప్పడంతో శనివారం బోరు వేయించి నీటి సమస్యకు పరిష్కారం చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, సర్పంచ్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్, జగన్ పాల్గొన్నారు.



పరిగి: తాగునీటి బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

ఆర్థిక సాయం

కుల్కచర్ల: మైనార్టీల సహాయార్థం అంబేడ్కర్ చేయూత ఫౌండేషన్ కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని నిరుపేద విద్యార్థులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నతికి స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, ఫౌండర్ అశోక్ కుమార్, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, మైనార్టీ నేతలు వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వార్షికోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మండల విద్యాధికారి హరిశ్చందర్

పూడూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నాయకులు ముందుకు రావాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. శుక్రవారం రాత్రి మేడిపల్లికలాన్‌ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించగా.. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు ఎస్ఎంసీ కమిటీలు, నాయకులు చేయూతనందించి విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు. పాఠశాలకు విద్యార్థులు సక్రమంగా వచ్చేలా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్ రెడ్డి, సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఆరీఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాజా మొయినొద్దీన్, ఎస్ఎంసీ చైర్మన్ రవికుమార్ పాల్గొన్నారు.

వేగాన్ని తగ్గించి ప్రమాదాలు నివారించి..

బొంరాస్‌పేట: వాహనాల వేగం తగ్గించి ప్రమాదాలు నివారించేందుకు పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. ఈ మేరకు మండల పరిధిలోని జాతీయ రహదారి 163పై స్పీడ్‌గన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఎస్ఐ శంకర్ ఆధ్వర్యంలో వాహనాల వేగాన్ని తగ్గించి, ప్రమాదాలు నివారించేందుకు మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద వేగనిరోధక చర్యలు చేపట్టారు. నిర్దేశించిన వేగాన్ని మించి స్పీడుగా వెళ్లే వాహనాలకు జరిమానా విధించారు.



స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

యాసంగి కొనుగోళ్లకు కసరత్తు

- ధాన్యం కేంద్రాల ఏర్పాట్లు ముమ్మరం
- ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8 సెంటర్లు
- మూడువారాల్లో చేతికందనున్న వరి
- తేమ 17 శాతానికి మించకుండా ఉండాలన్న అధికారులు

దౌల్తాబాద్: యాసంగి వరిసాగు ముగింపు దశకు చేరుకుంది. మరో రెండు వారాల్లో పంట చేతికి రాబోతున్న నేపథ్యంలో ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్కెట్ శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే అన్ని మండలాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. సాగుకు అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దౌల్తాబాద్ మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలు (దౌల్తాబాద్, గోకఫసల్‌వాద్, చల్లాపూర్, కొడీద్, మాటూరు, బిచ్చాల), మరో రెండు ఐకేపీ ఆధ్వర్యంలో (అంతారం, నందారం) ఏర్పాటు చేయనున్నారు. మండలంలో 11వేల 144 ఎకరాల్లో వరి సాగుకాగా.. బోర్లకింద సాగుచేసిన పంట కోత మొదలు కాబోతున్నాయి.

ఏఈఓ ధ్రువీకరణ తప్పనిసరి

కొనుగోలు ప్రక్రియలో పలు మార్పులు చేశారు. ప్రతిసారి రైతు పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు వచ్చిన తర్వాత ఏఈఓలు ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం తూకం వేసేవారు. అయితే ఈ సారి కేంద్రానికి ధాన్యం తరలించే ముందే ఏఈఓ పరిశీలించి టోకెన్‌తో పాటు గోనె సంచులు పంపిణీ చేస్తారు. అప్పుడే రైతులు తమ దిగుబడిని కేంద్రానికి తరలించాలని పీఏసీఎస్ సిబ్బంది సూచిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏగ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,060, బీగ్రేడ్‌కు రూ2,040 మద్దతు ధర ఇవ్వనుండగా.. తేమ శాతం 17కు మించి ఉండకుండా చూసుకోవాలి. దాంతో పాటు తప్ప, తాలు వంటివి లేకుండా ధాన్యం నాణ్యమైనదిగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుత కాలంలో వరిపంటలు హార్వెస్టర్‌తో కోతలు చేస్తుండడంతో.. ఆపరేటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇది వరకే వ్యవసాయ అధికారులు అవగహన కల్పించారు.



దౌల్తాబాద్‌లో కోతకు వచ్చిన వరిపంట

పక్షం రోజుల్లో..



మండలంలో మరో రెండు వారాల్లో వరికోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దాన్ని దృష్టిలో ఉంచుకొని 15 రోజుల్లో ఆరు గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయాలని చూస్తున్నాం. కేంద్రాలకు ధాన్యాన్ని తరలించే సమయంలో తాలు, తప్ప లేకుండా చూసుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, దౌల్తాబాద్

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి నియామకం

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా చామల రఘుపతిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలపై సోషల్ మీడియా ద్వారా ప్రజలను జాగురత చేస్తూ.. పార్టీ అభ్యున్నతికి పాటుపడతానని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పజెప్పినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి ప్రసాద్‌కుమార్, ఐటీసెల్ స్టేట్ ప్రతినిధులు సతీష్, నవీన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

పోలీసు పహారాలో రంజాన్



ఈద్గా వద్ద పోలీసులు

బొంరాస్‌పేట: రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయగా.. కొడంగల్ సీఐ, స్థానిక ఎస్ఐ శంకర్ పర్యవేక్షించారు.

ముస్లిం కమ్యూనిటీ హాల్‌కు రూ.90 లక్షలు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

యాలాల: రంజాన్ పర్వదినం సందర్భంగా యాలాల, రాస్నం గ్రామాల్లో ముస్లిం కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.90 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చెప్పారు. ఈ మేరకు ఆ రెండు గ్రామాల్లో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింల కమ్యూనిటీ భవనంతో పాటు శ్మశాన వాటికలకు ప్రహరీని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఉన్నారు.



కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్: బాలాజీనగర్ పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. పలు రకాల పూలతో అలంకరించారు. అక్షయ తృతీయను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



స్వామివారి సన్నిధిలో భక్తజనం